నవతెలంగాణ


సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

మంగళవారం | జూన్ 04, 2024 | www.navatelangana.com

నేడు నిజాంసాగర్ నీటి విడుదల

- కాలువలోకి ఎవరూ దిగొద్దు : ఏఈ శివకుమార్




నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ నుండి ఆలీ సాగర్‌కు తాగునీటి అవసరాల నిమిత్తం మంగళవారం నుంచి మూడు రోజులు 1500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్ట్ ఏఈ శివ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎవరు కూడా కాల్వలో దిగడం గాని స్నానం చేయడం గాని చేయవద్దని ఆయన సూచించారు. కాలువ నుండి అక్రమంగా తూములు తెరవడం నిషేధమని ఆయన తెలిపారు. అతిక్రమించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 4.8 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన తెలిపారు.

769 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించాం

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్



నవతెలంగాణ-కామారెడ్డి

32 లారీలలో 769 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించామని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ సోమవారం తెలిపారు. ప్రస్తుత యాసంగి కొనుగోళ్లకు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయుటకు గత మార్చి 26న ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 327, ఐకెపి ద్వారా 23 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 344 కేంద్రాలలో కొనుగోళ్లు పూర్తయ్యాయని, మరో 6 కేంద్రాలలో కొనుగోళ్ల ప్రక్రియ సాగుతున్నదని ఆయన తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 54,715 మంది రైతుల నుంచి 693 కో ట్ల రూపాయల విలువ గల 3,14,737 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. 98 శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసి 95 శాతం మేర అనగా రూ.659కోట్ల రైతుల ఖాతాలో జమచేశామని చంద్ర మోహన్ తెలిపారు. ఒకటి, రెండు రోజులు మిగతా 6 కేంద్రాలలో కొనుగోలు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

26లోగా లక్ష్యాలు పూర్తి చేయాలి

- రైస్‌మిల్లర్‌లతో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఖరీఫ్ 2022-23 సీజన్‌కు సంబంధించి లక్ష్యాలను ఈ నెల 26లోగా పూర్తి చేయని డిఫాల్టర్ రైస్ మిల్లుల యజమానులకు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లక్ష్యాలు పూర్తి చేయని 35 మంది రైస్‌మిల్ యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈనెల 26లోగా లక్ష్యాలు పూర్తి చేయని రైస్ మిల్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్లపై ఆర్ఆర్ చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇన్చార్జి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్‌లు కిష్టయ్య, శ్రీనివాస్, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లర్‌లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

భవితవ్యం తేలేది నేడే..

- కౌంటింగ్‌కు సర్వత్రా ఏర్పాట్లు చేపట్టిన అధికార యంత్రాంగం
- భారీ బందోబస్తు చేపట్టిన పోలీస్ యంత్రాంగం
- స్వల్ప తేడాలే చూపిన ఎగ్జిట్ పోల్స్.. అభ్యర్థుల్లో టెన్షన్





నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

లోక్‌సభ పోరులో ఆఖరి మజిలీ.. కౌంటింగ్ గడువు రానే వచ్చింది. నేడు(మంగళవారం) అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పకడ్బందీగా ఓట్ల లెక్కింపు కోసం ఇది వరకే సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. కాగా అభ్యర్థుల్లో నాయకుల్లో టెన్షన్ మొదలైంది. ఇటీవల విడుదలైన ఎగ్జిట్ పోల్ సర్వేల్లో సైతం స్వల్ప తేడా మాత్రమే ఉండటంతో ఉత్కంఠ నెలకొంది.

నిజామాబాద్ లోక్‌సభ స్థానం ఓట్ల లెక్కింపు డిచ్‌పల్లిలోని సీఎంసీ కాలేజీలో చేపట్టనున్నారు. ఆ స్థానం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలైన నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బోధన్, బాల్కొండతో పాటు జగిత్యాల, కోరుట్ల ఓట్ల లెక్కింపును సైతం ఇక్కడే చేపట్టనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 18 నుంచి 20 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఇక జహీరాబాద్ లోక్‌సభ స్థానం కౌంటింగ్‌ను సంగారెడ్డిలో చేపట్టనున్నారు. ఇందుకోసం అక్కడి అధికార యంత్రాగం ఏర్పాట్లు చేపట్టింది. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించనున్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు.

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బిజెపి అభ్యర్థి ధర్మపురి అరవింద్, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో బిజెపి నుంచి బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షట్కర్, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ బరిలో నిలిచారు. గత మే నెల 13న జహీరాబాద్, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికలు నిర్వహించారు. నిజామాబాద్ పార్లమెంటులో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల లో 17, 04,867 మంది ఓటర్లలో మొన్న జరిగిన ఎన్నికలలో 12,26,133 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించు కున్నారు. అందులోనూ 71.92 ఓటింగ్ శాతం నమోదు అయింది. జహీరాబాద్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల లో 16,41,410 మంది ఓటర్లలో మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 12,25,049 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు, అందులోను 74.63 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకోగలిగారు.

ఎగ్జిట్ పోల్స్ సైతం ఎటూ తేల్చలే..

ముందు నుంచి భావించినట్టే రెండు స్థానాల్లో సైతం కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు నడిచింది. 1వ తేదీన విడుదలైన ఎగ్జిట్ పోల్స్ సైతం ఏ పార్టీకి స్పష్టమైన మేజార్టీ ఇవ్వలేదు. రెండు పార్టీల మధ్య స్వల్ప ఓట్ల శాతంతో గెలిచే అవకాశాలున్నట్టు అంచనా వచ్చింది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల్లో, నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. మరో కొన్ని గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.



ప్రయివేటు విద్యాసంస్థల్లో దోపిడీ

- అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఎఫ్ఐ
- ప్రభుత్వ విద్యాసంస్థల్లో అనుభవజ్ఞులైన
- ఉపాధ్యాయులు, అధ్యాపకులుంటారని సూచన

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ డివిజన్‌లో ప్రైవేటు ఇంటర్, డిగ్రీ కాలేజీల ఆగడాలు రోజురోజుకు శ్రుతిమించుతున్నాయి. అడ్మిషన్‌ల పేరుతో అక్రమంగా విద్యార్థులను మభ్యపెట్టి అడ్మిషన్‌లు అత్యధికంగా చేస్తున్నారని బాన్సువాడ డివిజన్ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు అజయ్ కుమార్ అన్నారు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని సిఐటియు భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వ కళాశాలలో అనుభవమైన లెక్చరర్లు, ఉపాధ్యాయులు ఉంటున్నారని తెలిపారు. ప్రైవేటు బదులు ప్రభుత్వ కళాశాలలో చదువుకోవాలని వారు సూచించారు. బాన్సువాడ పట్టణంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను మాయమాటలు చెప్పి మభ్యపెట్టి అడ్మిషన్‌లు పొందుతున్నారని వారు ఆరోపించారు. అడ్మిషన్ తీసుకునే సమయంలో సకల సౌకర్యాలు కల్పిస్తామని చెబుతూనే చేరిన తర్వాత ముక్కు పిండి అధిక ఫీజులను వసూలు చేస్తున్నట్లు విమర్శించారు. ఇంటర్‌లో స్కాలర్‌షిప్, డిగ్రీలో ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకుని చదువు చెబుతామని హామీ ఇచ్చి అనంతరం ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తుంటారని, ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోనందున ప్రైవేటు కాలేజీలు ఇష్టారీతిన వ్యవహరిస్తు న్నాయన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని స్పష్టంచేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే కాలేజీల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ఫిర్దోస్, జిల్లా సహాయ కార్యదర్శి సాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హరితహారంపై గొడ్డలి వేటు

- యథేచ్ఛగా హరితహారం చెట్ల నరికివేత
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

నవతెలంగాణ-నసురుల్లబాద్

పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయాలు వెచ్చించి హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి ఏడాది వానాకాలంలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం, ప్రైవేటు ఖాళీ స్థలాలతో పాటు, ఇళ్లలో, పొలాలు, చెరువులు గట్లపై ప్రతిష్ఠాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపడుతున్నారు. అవి పెరిగి పెద్దవికాగానే కొందరు అక్రమంగా ఏపుగా పెరిగిన చెట్లను నరికేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మండలంలోని దుర్కి గ్రామంలోని నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటర్ 22వ కాలువపై ఉన్న వందలాది పెద్దపెద్ద వృక్షాలను కొందరు వ్యక్తులు ఇటుక బట్టీల కోసం చెట్లుకోసే యంత్రాలతో చెట్లను నరికి వేయడంతో హరితహారంపై గొడ్డలి వేటు పడింది. బస్వాయిపల్లి నుంచి దుర్కి గ్రామం వరకు ఉన్న నిజాంసాగర్ 22వ డిస్ట్రిబ్యూటర్ కాల్వపై ఉన్న చెట్లను యంత్రాల సాయంతో నరికి వేశారు. ఈ తతాంగం అంత గత రెండు రోజుల నుంచి జరుగుతున్నా హరితహారం నిర్వాహకులు, గ్రామపంచాయతీ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో దర్జాగా చెట్లను నరికి వేశారు.





చెట్లను నరికిన దృశ్యం

కన్నెత్తి చూడని మున్సిపల్ అధికారులు..

గ్రామీణ ప్రాంతంలో వంట చేసుకునేందుకు కట్టెల కోసం అడవి నుంచి ఎండిపోయిన కట్టెలను పేదవారు తీసుకుని వస్తుంటే అధికారులు పట్టుకొని వారికి జరిమానా విధిస్తుంటారు. హరితరంలో పెంచిన మొక్కలు పెరిగి పచ్చగా ఉన్న చెట్లు కొందరు అక్రమంగా వారి స్వార్థం కోసం యంత్రాల సాయంతో నరికి వేస్తుంటే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ బోధన్ వెళ్లే మార్గంలో దుర్కి గ్రామం మధ్యలో ఉన్న చెట్లను నరికివేసినా పట్టించుకోని అటవీశాఖ అధికారులు.. ఇకనైన అధికారులు స్పందించి చెట్లు నరికివేతకు గురికాకండా చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు..

హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను అక్రమంగా కొందరు వ్యక్తులు 100కు పైగా యంత్రాల సాయంతో చెట్లను నరికి వేసినందుకు గాను వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు నసురుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఎంపీడీవో కళావతి తెలిపారు. చెట్లను నరికి వేసిన వారిని గుర్తించి వెంటనే జరిమానాతో పాటు వారికి శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు వారు సూచించారు.

గాలి వాన బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఒకసారిగా గాలివాన రావడంతో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోపల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మంజీర పరివాహక ప్రాంతంలో రైతుల పంట పొలాలకు సంబంధించి 11 కె.వికు సంబంధించి 15 విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. గద్దెల పైన ఉన్న 4 ట్రాన్‌ఫార్మర్‌లు కిందపడి పాడైపోయాయి. ఆదివారం రాత్రి ట్రాన్స్కో అధికారులు మరమ్మతులు చేసి మండల కేంద్రంలో విద్యుత్ సప్లై చేశారు. నెలకొరిగిన విద్యుత్ స్తంభాలను చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లను సోమవారం ఉదయం ఎడి సుదర్శన్, ఏఈ మనోరంజన్, లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, లైన్మెన్ శశికాంత్‌రెడ్డి పరిశీలించి వాటిని మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చినట్టు తెలిపారు.





గాలి, వానకు నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్



నేల కొరిగిన విద్యుత్ స్తంభం

అబ్జర్వర్ల సమక్షంలో

కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం పూర్తి చేశారు. ఎన్నికల పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, లలిత్ కుమార్ సమక్షంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా ర్యాండమైజేషన్ ప్రక్రియ జరిపారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలైన ఓట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్లను జూన్ 04వ తేదీన డిచ్‌పల్లిలోని సీఎంసీ కళాశాలలో లెక్కించనున్నారు. ఈ మేరకు కౌంటింగ్ సిబ్బందిని సెకండ్ ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం ఖరారు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఈ ప్రక్రియ మొత్తాన్ని స్క్రీన్ ద్వారా చూపించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఖరారైన జాబితాను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొంటున్న మైక్రో అబ్జర్వర్లకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపుపై శిక్షణ తరగతులు సైతం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా నిర్వర్తించాల్సిన విధులు, పాటించాల్సిన నిబంధనల పట్ల పూర్తి అవగాహన కల్పించారు. మంగళవారం ఉదయం ఐదు గంటలకు మూడవ విడత ర్యాండమైజెషన్ పూర్తయిన మీదట ఆ జాబితా ఆధారంగా పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, కోరుట్ల, జగిత్యాల శాసనసభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజవర్గంలో 7 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోల్ అయిన ఓట్లను రౌండ్ల వారీగా లెక్కించేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఆదేశాల అనుసారం 25 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతూ, ఈవీఎం ఓట్ల కౌంటింగ్ కోసం 448 మందిని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 70 మందిని కలుపుకుని మొత్తం 558 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించామని వివరించారు. వీరిలో 180 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 190 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 188 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఎన్ఐసీ అధికారి రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, అధికారులు

అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు పరిశీలన



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాల మరమ్మతు పనులను మండల ప్రత్యేక అధికారి వాజిద్ హుస్సేన్, ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. మండలంలోని సాటాపూర్, పేపర్‌మిల్లు, బోర్గం, తాడ్‌బిలోలి గ్రామాలలో పర్యటించి మరమ్మతు పనులను వేగవంతం చేయాలని వారు స్థానిక కాంట్రాక్టర్లను ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పనులను పూర్తి చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, పిఆర్ ఏఈ వినయ్ కుమార్, గ్రామ కార్యదర్శి, ఆయా పాఠశాలలలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓం పద్మశాలి విజయ సంఘం నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని ఓం పద్మశాలి విజయ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ మేరకు ఓం పద్మశాలి విజయ సంఘం ఫంక్షన్ హాల్‌లో సంఘం సభ్యుల సర్వసభ్య సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. ఓం పద్మశాలి విజయ సంఘం నూతన అధ్యక్షులు గా పిల్లమర్రి సుధాకర్, ఉపాధ్యక్షులుగా చింత హనుమం తు, కార్యదర్శిగా డాక్టర్ చింత హనుమంతు, కోశాధికారి గా ఆడిచర్ల రాజు, దైవశక్తిగా వన్నెల దాస్ భాగ్యరాజ్, ఉద య్, కార్యవర్గ సభ్యులుగా పెండం మినేష్, పిల్లమర్రి రవీందర్, చిలివేరి గంగాప్రసాద్, చింత సత్యపాల్, సుం ‘కుంట్ల నరేష్, బొడ్డు రాజు, అడిచర్ల రజనీకాంత్, బొడ్డు అరవింద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తమవంతుగా పాటుపడతామన్నారు.

బుల్డోజర్లతో జోరుగా ఇసుక తవ్వకాలు



జేసీబీతో ఇసుకను నింపుతున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామం సమీపంలోని మంజీరా నదిలో కొంతమంది వ్యక్తులు బుల్డోజర్లతో జోరుగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో ఇసుక తరలిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతూ ట్రాక్టర్లు, టిప్పర్లలో లోడింగ్ చేయడం వలన స్థానికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. కావున అధికారులు స్పందించి నిబంధనల మేరకు యంత్రాలతో కాకుండా స్థానిక కూలీలతో ఇసుక నింపడానికి చర్యలు తీసుకోవాలని ఖండ్ గాం గ్రామస్థులు కోరుతున్నారు.

బస్సుల్లో ప్రయాణికుల రద్దీ



బస్సువద్ద కిక్కిరిసిన ప్రజలు

నవతెలంగాణ-బోధన్

నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో మహిళలు అధికంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. గత వారం రోజులుగా జోరుగా శుభకార్యాలు ఉండడంతో బస్సులు ప్రయాణికులతో రద్దీగా మారాయి. సోమవారం బోధన్, నిజామాబాద్ బస్టాండ్‌లలో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ మరింత ఎక్కువైంది. దాంతో బస్సులో సీట్ల కోసం ప్రయాణికులు దిగకుండానే ఎక్కేవాళ్లు ఎక్కుతుండడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ప్రయాణికులను అదుపు చేయవలసి వచ్చింది.

ప్రపంచ సైకిల్ దినోత్సవం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా అసోసియేషన్ పిలుపు మేరకు నిజామాబాద్ అర్బన్ న్యూస్ పేపర్ ఏజెంట్స్ హకార్స్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కృష్ణ గోపాల్, తూకరం మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా కాలుష్య రహిత ప్రపంచాన్ని తయారు చేసుకుందామని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్ర అధ్యక్షులు వనమాల సత్యం మాట్లాడుతూ ఈ రోజుల్లో ప్రజలు సైకిల్ తొక్కడం మర్చిపోతున్నారని ప్రతి ఒక్కరూ ఎన్నో రోగాలతో సతమతమవుతున్నారని తెలిపారు. కావున రోజుకు కనీసం 2 గంటలు సైకిల్ తొక్కాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏజెంట్స్ కృష్ణగోపాల్‌రావు, తూకరం, రాష్ట్ర అధ్యక్షులు వనమాల సత్యం, నిజామాబాద్ అర్బన్ అధ్యక్షులు రణం రవీందర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు ఈ సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు.

పాఠశాలలు పున:ప్రారంభం అయ్యేలోపు యూనిఫామ్‌లు అందించాలి

- డిఆర్‌డీవో సాయాగౌడ్



కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఆర్‌డివో

నవతెలంగాణ-ఆర్మూర్

పాఠశాలలు పున:ప్రారంభమయ్యేలోపు మహిళా సంఘాలు యూనిఫామ్‌లు అందించాలని డిఆర్‌డిఓ సాయగౌడ్ సూచించారు. సోమవారం మండల సమాఖ్య కార్యాలయాన్ని మండలంలోని పిప్రి గ్రామాన్ని సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు యూనిఫామ్‌లు కుట్టే అవకాశం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మహిళ సంఘాలకు దక్కిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మహిళ సంఘాల సభ్యులచే కుట్టించే ఏకరూప దుస్తులను పరిశీలించారు. పాఠశాలల పున:ప్రారంభానికి అందించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగారాం, సీసీ కల్పన, వీవోఏలు స్రవంతి, రాజమని, స్వయం సహాయక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/డిచ్‌పల్లి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లిలో గల సీఎంసీ కళాశాలలో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్నామన్నారు. గత 2019 పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సైతం ఇక్కడే జరిగిందని అన్నారు. అయితే ఆ ఎన్నికల్లో కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలైన ఓట్లను జగిత్యాలలో లెక్కించగా, ఈసారి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌ను ఒకేచోట సీఎంసీలోనే నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు.

మంగళవారం ఉదయం 5.00 గంటలకు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించి, ఆ జాబితాను అనుసరిస్తూ సిబ్బందిని కేటాయిస్తామని అన్నారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా సిబ్బందిని అన్నివిధాలుగా సన్నద్ధం చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఇప్పటికే పలు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పించామని అన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలను తెలిపేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామని, ఎలాంటి పొరపాట్లు, గందరగోళానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 7 కౌంటింగ్ హాల్‌లను ఏర్పాటు చేశామని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం కూడా ప్రత్యేకంగా కౌంటింగ్ హాల్ నెలకొల్పామని తెలిపారు. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం 20 చొప్పున టేబుళ్ల ఏర్పాటు చేయగా, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల కౌంటింగ్ కోసం 18 చొప్పున టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కౌంటింగ్‌కై 10 టేబుళ్ల ఏర్పాటు చేశామని అన్నారు. 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని, మధ్యాహ్నం 3గంటలకు కౌంటింగ్ పూర్తయ్యే అవకాశం ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని వివరించారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోల్ అయిన ఓట్లను రౌండ్ల వారీగా లెక్కించేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఆదేశాల అనుసారం 25 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతూ, ఈవీఎం ఓట్ల కౌంటింగ్ కోసం 448 మందిని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 70 మందిని కలుపుకుని మొత్తం 558 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించామని వివరించారు. వీరిలో 180 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 190 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 188 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఈవీఎంల ఓట్లను అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా, ఒక్కో రౌండ్ వారీగా లెక్కిస్తూ, ఫలితాలను వెల్లడిస్తామని, మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్లను కలుపుతూ పార్లమెంటు నియోజకవర్గం వారీగా కూడా ఫలితాలను ప్రకటిస్తామని అన్నారు. కాగా, అభ్యర్థులు, వారి తరపున ఏజెంట్లు ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ సెంటర్ వద్దకు రావాలని కలెక్టర్ సూచించారు. తాము జారీ చేసిన ఎంట్రీ పాసులతో పాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అలాగే, కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యాక ఏజెంట్ల మార్పునకు అవకాశం ఉండదని అన్నారు. పాసు కలిగి ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్‌లోనికి అనుమతించనున్నట్టు తెలిపారు. అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా తుది ఏర్పాట్లను పూర్తి చేశామని, సిబ్బందికి అల్పాహారం, భోజనాలను కూడా ఓట్ల లెక్కింపు కేంద్రంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పక్కాగా నిబంధనలను పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని కలెక్టర్ కౌంటింగ్ సిబ్బందికి హితవు పలికారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రం చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తూ, అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు.

పుస్తకాలు తీసుకెళ్లండి

- విద్యార్థుల తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యాల ఫోన్
- పుస్తకాల లెక్కతో అడ్మిషన్లు భద్రమని భావిస్తున్న స్కూళ్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ అడ్మిషన్లు కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. అందు లో భాగంగా ఇంతకుముందే అడ్మిషన్ తీసుకుని అదే స్కూళ్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆ స్కూల్ యాజమాన్యాలు ఫోన్ చేసి 'సార్/మేడమ్ త్వరలో స్కూల్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో మీ పిల్లలకు అవసరమైన పుస్తకాలను తీసుకెళ్లండి. లేదంటే పుస్తకాల కొరత ఏర్పడవచ్చు. దాంతో ఇబ్బందులు ఎదురవుతాయి.' అని చెబుతున్నారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 468 ప్రయివేటు స్కూళ్లలన్నాయి. ఇందులో ప్రైమరీ 21 ఉండగా, ప్రాథమికోన్నత పాఠశాలలు 223, హైస్కూల్ 224 ఉన్నాయి. కాగా ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు తమ పాఠశాలల నుంచి ఇతర పాఠశాలకు ఏమైనా వెళ్తున్నారా... వెళ్లకుండా వచ్చే విద్యా సంవత్సరం కూడా ఆ విద్యార్థులు తమ పాఠశాలకే విద్య నేర్చుకుంటున్నారా, అనే అంశాలను తెలుసుకొనుటకై ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థల ఏప్రిల్, మే నెల నుంచే వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమగు పుస్తకాలు వచ్చాయన, కొనుగోలు చేసి తీసుకోండి అంటూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెబుతున్నారు. మీ పిల్లలకు సంబంధించిన పుస్తకాలు తీసుకోండి మళ్లీ తర్వాత పుస్తకాల కొరత ఏర్పడవచ్చు అనే అంశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. దాంతో ముందస్తుగానే పుస్తకాలు కొనుగోలు చేసే విధంగా ప్రయత్నిస్తే ఈ విద్యార్థి మా వద్దనే ఉంటారన్న భరోసా వారిలో నెలకొంది.

ఆన్‌లైన్ క్లాసులు..

విద్యార్థుల పుస్తకాలు కొనుగోలుతో పాటు మే నెలలోనే విద్యార్థులకు ఆయా పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేకమైన తరగతులు ఆన్లైన్‌లో నిర్వహించారు. బేసిక్ నాలెడ్జ్‌ను ఖచ్చితంగా నేర్పారు. ఆ క్లాసులకు సైతం ఓ ప్రత్యేకమైన ఫీజును నిర్ణయించారు. ప్రస్తుతం పుస్తకాలతో పాటు, ఆన్‌లైన్ క్లాసుల ఫీజు, నూతన విద్యాసంవత్సరానికి సంబంధించిన స్కూలు ఫీజు కలిపి మొత్తం ఫీజును వసూలు చేస్తున్నారు. అధిక ఫీజుల వసూలుతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

అక్రమ పట్టాలు రద్దు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్‌నగర్ గ్రామ పరిధిలో గల సర్వేనెంబర్ 73లో అక్రమ పట్టాలను రద్దు చేయాలని కోరుతూ అమీర్‌నగర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తహసిల్దార్ ఆంజనేయులకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ పరిధిలోని పోరంబోకు భూమి సర్వే నంబర్ 73లో చౌట్‌పల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమే గతంలో రెండు మూడు సార్లు వినతి పత్రాలు కూడా అందజేసి నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ భూమిలో విద్యుత్ స్తంభాలు వేసే పని జరుగుతుందని, కావున వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. సర్వే నిర్వహించి అక్రమ పట్టాలను రద్దు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన విధులకు రాకుంటే చర్యలు

- ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై డీఐఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



విద్యాధికారి రవికుమార్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో ఇంటర్ సప్లిమెంటరీ జవాబు పత్రాలు మూల్యాంకనం బుధవారం ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్ తెలిపారు. మొదటి స్పెల్ 5 నుంచి ప్రారంభం కానున్న సంస్కృతం, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, పౌర శాస్త్రం, ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్ట్‌ల మూల్యాంకనం ప్రారంభం కానుందని తెలిపారు. ఈ మూల్యాంకనంలో పాల్గొనాల్సిన అధ్యాపకులకు ఆయా కళాశాల లాగిన్‌లో నియామక పత్రాలను ఇంటర్ బోర్డు నిక్షిప్తం చేసిందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రైవేట్, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో, కేజీబీవీ కళాశాలలలో, మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో, బీసి రెసిడెన్షియల్ కళాశాలలో ఇతర అన్ని జూనియర్ కళాశాలలో వెంటనే ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు మూల్యాంకన విధులు కేటాయించబడిన అధ్యాపకుల ను తమ విధుల నుంచి ఈనెల 4న రిలీవ్ చేసి మూల్యాంకన కేంద్రంలో పాల్గొనేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూల్యాంకన విధులకు అధ్యాపకులను రిలీవ్ చేయని ప్రిన్సిపాల్‌లపై, రిలీవ్ చేసినా విధులలో పాల్గొనని అధ్యాపకులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడానికి ఇంటర్ బోర్డు సిద్ధంగా ఉందని డిఐఈఓ తెలిపారు. కావున అధ్యాపకులు అందరూ తమకు కేటాయించిన మూల్యాంకన సబ్జెక్టులలో బుధవారం ఉదయం సరిగ్గా పది గంటలకు రిపోర్టు చేయాలని ఆదేశించారు. రెండవ స్పెల్ 7న శుక్రవారం బోటని, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ మూల్యాంకనం ప్రారంభం కానుందని అన్ని కళాశాలల్లో అధ్యాపకులను రిలీవ్ చేయాలని ఇంటర్ విద్య అధికారి ఆదేశించారు. మూల్యాంకనం విధులలో పాల్గొనని అధ్యాపకుల విషయంలో ఇంటర్ బోర్డు గతంలో జరిమానాలు విధించిన విషయం తెలిసిందేనని, కావున ప్రతి ఒక్కరూ మూల్యాంకన విధుల్లో పాల్గొనాలని ఆదేశించారు.

ఇంటర్ సప్లమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు..

ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు జనరల్, ఒకేషనల్ అన్ని సబ్జెక్టుల ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 4 నుంచి ప్రారంభమవుతాయని జిల్లా ఇంటర్ విద్యా అధికారి అన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు అన్ని కూడా జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ ప్రభుత్వ బాలుర ఖిల్లా జూనియర్ కళాశాలలో నిర్వహిస్తామని, అన్ని కళాశాలల ప్రిన్సిపాల్లు విద్యార్థులకు ఈ విషయమై అవగాహన కల్పించి జిల్లా కేంద్రంలో ప్రాక్టికల్ పరీక్షలకు హాల్ టికెట్లు ఇచ్చి పంపాలని ఆదేశించారు.

జీవాల తరలింపును అడ్డుకునే వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-బోధన్

త్వరలో బక్రీద్ పండగ సమీపిస్తుండడంతో పండగ సందర్భంగా వాహనాల్లో అనుమతి తీసుకుని పశువులను తరలిస్తున్న సందర్భంగా కొంతమంది వ్యక్తులు వాటిని అడ్డుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అలాంటి వారిని గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నాయకులు సోమవారం బోధన్ పట్టణ సీఐ వీరయ్యకు వినతిపత్రం అందించారు.

విజయ్ విద్యార్థికి కథాబహుమతి



బహుమతిని అందుకుంటున్న విద్యార్థి విజయ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి 'బాలల కథల' పోటీలో విజయ్ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న ఎం.రిష్విత్ ఉత్తమ కథా బహుమతి అందుకున్నారని విజయ్ సంస్థల వ్యవస్థాపకురాలు డా.అమృతలత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి సారస్వత పరిషత్‌వారు పంపించిన పుస్తకాలు, ప్రశంసాపత్రం, నగదు బహుమతిని సోమవారం అందజేశారు. ఈ పోటీలో రెండు తెలుగు రాష్ట్రాలలోని వందలాదిమంది విద్యార్థులు పోటీపడగా ఐదుగురి కథలను ఎంపికచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రిష్విత్‌రాసిన 'అమ్మమాట' అనే కథకు ఈ బహుమతి లభించింది. ఈ విద్యార్థి అభినందన కార్యక్రమంలో ఇందూర్ జిల్లా బాలసాహిత్య వేదిక అధ్యక్షులు డా.కాసర్ల నరేశ్‌రావు, కరస్పాండెంట్ వి.ప్రభాదేవి, ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్ ఎ.తారాచౌదరి, తెలుగు ఉపాధ్యాయురాలు అనురాధ పాల్గొన్నారు.

8వ రోజుకు కార్మికుల సమ్మె

- హెచ్‌పీ గ్యాస్ కార్మికులకు ఇండియన్ గ్యాస్ కార్మికుల మద్దతు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



సమ్మెలో పాల్గొన్న గ్యాస్ ఏజెన్సీ కార్మికులు

గత ఎనిమిది రోజులుగా నిజామాబాద్‌లో సమ్మె చేస్తున్న హెచ్‌పీ అనంత్‌గ్యాస్, శేఖర్‌గ్యాస్ ఏజెన్సీల సిలిండర్ డెలివరీ బాయ్‌ల సమ్మెకు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ కార్మికులు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ ఎనిమిది రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా యాజమాన్యం, కార్మిక శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించటం సరికాదన్నారు. ఆయిల్ కంపెనీ గైడెన్స్ ప్రకారం ప్రతి సిలిండర్ డెలివరీ చార్జీలను చెల్లించమంటే చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవలసిన సివిల్ సప్లై అధికారులు, కార్మికశాఖ అధికారులు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించటం లేదన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాలిచ్చినా.. స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించని లేని పక్షంలో ఏఐటీయూసీగా జిల్లాలోని మిగతా ఏజెన్సీల కార్మికులను కూడగట్టి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.హనుమాన్లు, గ్యాస్ ఏజెన్సీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సాయన్న, కోశాధికారి రవికుమార్, నాయకులు శివకుమార్, నయీమ్, గంగాధర, ప్రసాద్, రాజు కార్మికుల తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని విట్టల్ వాడీ తండా, జగన్నాథ్‌పల్లి తండాలలో వివాహ వేడుకలకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సోమవారం హాజరయ్యా రు. వధూవరులను ఆశీర్వదించారు. విట్టల్ వాడీ తండాలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పవార్ మోహన్ కుమారుడి వివాహానికి, జగన్నాథ్ పల్లి తండాలో బామన్ మోతీలాల్ కూతురు వివాహానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యేను వారు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, నాయకులు నాగిరెడ్డి పటేల్, శ్యామప్పపటేల్, మల్లప్పపటేల్, బన్సిలాల్, వినోద్, జాగోర్, తదితరులు పాల్గొన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

జీలుగా విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోనీ సహకార సంఘంలో రైతులకు జిలుగా విత్తనాలు ఏఈఓ మాధవి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయ శాఖ ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై జిలుగా విత్తనాలను ఇవ్వడం జరుగుతుందని, జిలుగా 30కిలోల బస్తకు ధర రూ.2790, సబ్సిడీ రూ.1674, కానీ రైతు రూ.1116 చెల్లించి ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకం జిరక్స్ తీసుకొని రావాలని తెలిపారు. 2.20 ఎకరాకు ఒక బస్తా ఇస్తున్నట్టు తెలిపారు. రైతులందరూ ఈ సబ్సిడీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో సందీప్, రమేష్, మారుతి, బస్వంత్, నర్సింలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇసుక తవ్వకాలు అడ్డగింత

- నిత్యం వందలాది లారీలు తరలుతున్నట్టు ఆవేదన
- అడుగంటిన భూగర్భ జలాలు
- ఇసుక గుంతల్లో యువకులు పడి మృతి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మంజీర నదిలో పలువురు అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తున్నారు. అనుమతులకు మించి భారీగా ఇసుక తవ్వకాలను చేపడుతుండడంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. ప్రతి సంవత్సరం వరదలు వచ్చినా ఇసుక తరలింపు భారీగా జరుగుతుండడంతో జలమట్టాలు తగ్గిపోతుండడం వల్ల పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి.. ఇసుక కోసం తవ్విన గుంతల్లో ప్రమాదవశాత్తు పడుతూ పలువురు తమ ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో ఆగ్రహించిన మహిళలు సోమవారం అక్రమ ఇసుకను అరికట్టాలంటూ ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా 15 నుంచి 20 మీటర్ల లోతు లో నుంచి మంజీరా నదిలో ఇసుక త్రవ్వకాలు జరపడం.. దీనికి తోడు ప్రభుత్వ అనుమతి లేకుండా 200 లారీల పైగా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక దందా కొనసాగుతుంది అంటూ పెద్ద ఎత్తున మహిళలు బీర్కూర్ మంజీరా నదిలో కొనసాగుతున్న ఇసుక క్వారీ వద్దకు వచ్చి ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. రెండు రోజుల క్రితం ఇదే పని చేసినప్పటికీ మళ్లీ రాజకీయ నాయకుల, పోలీసుల అండ, గ్రామంలోని కొంతమంది పైరవీ కారుల అండదండలతో మళ్ళీ ఇసుక తవ్వకాలు జరపడంతో సోమవారం పెద్ద ఎత్తున మహిళలు ఇసుక క్వారీ వద్దకు వచ్చి ఆందోళన చేపట్టి ఇసుక తవ్వకాలు నిలిపివేశారు.


ఆందోళన చేపట్టిన మహిళలు


నిలిచిన ఇసుక లారీలు

జిల్లా కలెక్టర్ ఇచ్చిన నిబంధనల ప్రకారం మూడు మీటర్ల లోతులో ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉండగా 15 నుంచి 20 మీటర్ల లోతుతో నీటిలో నుంచి ఇసుకను బయటకు తీస్తున్నారంటూ మహిళలు ఆరోపించారు. భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు జరగడంతో తమకు చెందిన వ్యవసాయ బోర్లు ఎత్తిపోతున్నాయని ఆవేదన చెందారు. తమని వేధించడానికి కొంతమంది పోలీసులు, గ్రామ రాజకీయ నాయకులు తమకు బెదిరి స్తున్నారంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికార పార్టీ అండదండలతో కొందరు రాజకీయ నాయకులు రోజుకు 20 నుంచి 30 లారీలకు కంటే ఎక్కువగా లారీలు జీరోలో తీసుకెళు న్నారం టూ మహిళలు ఆరోపించారు. క్వారీల వద్ద స్థానిక రాజకీయ నాయ కులు అడ్డా వేసి క్వారీ నిర్వాహకుల నుంచి అక్రమంగా జీరో లో ఇసుకను తరలి వేస్తున్నా రంటూ జీరో లో వెళ్లే వాహనాలను అడ్డుకోలం టూ అధికారులను కోరారు. ఇసుక క్వారీల వద్ద సీసీ కెమెరాలు, వే బ్రిడ్జిలు, జిపిఎస్ విధానం తీసుకురావాలని మహిళలు డిమాండ్ చేశారు.

ఉదయం నుంచి రాత్రి వరకు మంజీరా నదిలో మహిళలు నిలబడి నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బీర్కూరు మంజీరా వారి నుండి ఇసుక తరలించడం జరుగుతుందని అలాగే జీరోలో ఇసుకను తరలించడం లేదంటూ మంజీరా నది పరివాహక ప్రాంతం ప్రజల అభివృద్ధి పనుల కోసం ఇసుకను తరలించడం జరుగుతుందని క్వారీ నిర్వాహకులు తెలిపారు.

కల్లాలను ఏర్పాటు చేసుకోవాలి

- రైతులతో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి/రామారెడ్డి

రైతులు కల్లాలను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే రైతులతో సమావేశమై రైతు కల్లాల ఏర్పాటుపై సమీక్షించారు. మున్సిపల్ పరిధిలోని అడ్లూరు గ్రామం, మండలంలోని ఇస్రోజివాడి, గర్గుల్, శాబ్దిపూర్ తదితర గ్రామాలలోని పంచాయతీ వద్ద రైతులతో సమావేశమై మాట్లాడారు. ధాన్యాన్ని ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై ఆరబోసి, రోడ్లపై వెళ్లే వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. మీ పంట పొలాల వద్దనే కల్లాలని ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

రామారెడ్డి : కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సోమవారం మండలంలోని మద్దికుంట, రెడ్డిపేట, అన్నారం గ్రామాల్లో పర్యటించనున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు. రైతు కల్లాల ఏర్పాటు, రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి రైతులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పార్టీ నాయకులు గోపు గంగారం తెలిపారు.

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-కామారెడ్డి

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్టు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు తెలిపారు. మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు 268 హాజరుకావాల్సిందిగా 233 మంది హాజరై, 35 మంది గైరాజరైనట్లు ఆయన తెలిపారు.

పాలిసెట్ ఫలితాల్లో పలువురి ప్రతిభ

నవతెలంగాణ-లింగంపేట్/భిక్కనూర్



పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష (పాలిసెట్)లో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. లింగంపేట్ మండలం మాలోత్ తాండ గ్రామానికి చెందిన ఎం.శేషాద్రి పాలిసెట్ ఫలితాలలో ఎంబిఐపిసిలో తెలంగాణ స్టేట్‌లో 13 ర్యాంకు సాధించాడు. అలాగే ఎంపిసిలో స్టేట్‌లో 75 ర్యాంకు సాధించి గ్రామానికి వన్నె తెచ్చాడు. ఎం.శేషాద్రి ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు వర్నిలోని మ్యాట్రిక్ పాఠశాలలో, ఐదు నుంచి పదో తరగతి వరకూ కామారెడ్డిలోని సరస్వతి శిశుమందిర్ స్కూల్‌లో చదివాడు. శేషాద్రి తల్లిదండ్రులు మాలోత్ మోహన్ కళావతి, శేసాద్రిని సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తదితరులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకోవాలని మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పాలిసెట్‌లో మెరిసిన విజ్ఞాన్ విద్యార్థి



భిక్కనూర్ : పట్టణంలో ఉన్న విజ్ఞాన్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి పాలీసెట్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. విజ్ఞాన్ పాఠశాలలో పదవ తరగతి చదువుకొన్న విద్యార్థిని ఏనుగు సిరివెన్నెల పాలిసెట్ ఫలితాలలో ఎంపీసీ 366, బైపీసీ 222 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాధించిన సిరివెన్నెల, విద్యార్థి తల్లిదండ్రులను పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజలు అభినందిస్తున్నారు.

మార్పు కోసం యువత ముందడుగు

నవతెలంగాణ-లింగంపేట్

మేజర్ పంచాయతీలో అనేక సమస్యలతో సతమతమవుతుందని లింగంపేట్ మార్పు అనే నినాదంతో యువత.. కులాలకు, మతాలకు అతీతంగా ముందుకొస్తున్నారు. గ్రామ అభివృద్ధిలో యువత నడుంబుగించి గత వారం రోజులుగా శ్రమదానం, పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగిస్తున్నారు. గ్రామస్తులు, గ్రామపెద్దలు వారిని అభినందిస్తున్నారు. పాలకులు మేజర్ గ్రామపంచాయతీని నెలకొన్న సమస్యలను పరిష్కరించిన దాఖలాలు లేవు. ఎక్కడ సమస్యలు అక్కడ తలెత్తుతున్నాయి. పాలకుల పదవి కాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ఆదివారం బీసీ వసతి గృహం ఎదుట ఉన్న చెత్తను, కట్టు కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని మురికి కాలువలో చెత్త చెదాన్ని తొలగించారు. ఆస్పత్రి ముందు రోడ్డుపై వర్షానికి నీళ్ల చెరువు లాగా నిండిపోవడంతో దీనివలన ఆసుపత్రికి వచ్చే రోగులకు, గర్భిణీలకు వ్యాధులు ప్రబలకుండా చెత్తను తొలగించారు. ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా తమ ఇంటి పరిసరాలను వారు పరిశుభ్రంగా ఉంచుకున్నట్లు రహదారులను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. యువత చేపడుతున్న పనులకు పలువురు యువతను అభినందిస్తున్నారు. కార్యక్రమంలో వంశీ, క్రాంతికుమార్, దాసరి అనిల్, సురేష్ బాలరాజు, దిలీప్, రంజిత్, శ్రీను, శశి ప్రీతం, శివ, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నిజాంసాగర్



మండలంలోని మల్లూరు గ్రామంలో ఊరటి రాములు (40) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాములు గత కొద్ది కాలం నుంచి పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది తన ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినుట పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్య

- పొలం పట్టా చేస్తారో లేదో అని దిగులుతో

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



పొలం పట్టాను తన అన్న తన పేరు మీద చేస్తారో లేదో దిగులతో ఓ రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ఎర్రకుంట తండాలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఉమేశ్ వివరాల ప్రకారం.. తండాకు చెందిన మలావత్ కెవ్ల (36) తన పెద్దన్న సక్కు పొలం పట్టా చేస్తాడో లేదో అని ఆందోళనకు గురయ్యేవాడు.

ఆదివారం కల్లు సీసాలో విషపూరితమందు కలుపుకొని తాగి ఆకస్మారకస్థితిలో పడి ఉండడంతో గమనించిన కుటుంబీకులు వెంటనే ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కేవ్లా మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి భార్య యమునా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

యూనిఫాంలు సకాలంలో అందజేయాలి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని చీనురు గ్రామంలో ఏర్పాటు చేసిన మహిళాశక్తి కుట్టుమిషన్ కేంద్రాన్ని ఏపీఎం జగదీష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీ వరకు కుట్టడం పూర్తిచేసి దుస్తులను ఆయా పాఠశాలకు అందించాలని అన్నారు. దుస్తులని నాణ్యతగా సైజుల ప్రకారం కుట్టాలని వారికి సూచించారు. ఆయన వెంట సిసి రమేష్ ఉన్నారు.


యూనిఫాంలు చూపెడుతున్న మహిళలు

ఆలయానికి దాతల విరాళం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో శ్రీ ముత్యాల పోచమ్మ గుడి మరమ్మతుల కొరకు పలువురు దాతలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. అదే గ్రామానికి చెందిన కమ్మరి పోచయ్య జ్ఞాపకార్థం తన కుమారుడు కమ్మరి కిరణ్ ముత్యాల పోచమ్మ ఆలయ ఆవరణలో టైల్స్ వేయించారు. అదేవిధంగా నీల బాల్ లింగం రూ.11,116 వడ్ల సిద్ధిరాములు తన మనుమడు కమ్మరి అక్షిత్ కుమార్ పేరున రూ.5,116 విరాళంగా ఆలయ కమిటీకి అందజేశారు. మరి కొంతమంది దాతలు వారికి తోచిన విరాళాలు అందజేశారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు తదితరులున్నారు.

దశాబ్ది ఉత్సవాలు ముగింపు


కామారెడ్డి : పేషెంట్‌లకు పండ్లు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి/రామారెడ్డి

తెలంగాణ దశాబ్ది ముగింపు ఉత్సవాల్లో భాగంగా జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు యంకె.ముజీబోద్దీన్ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గంప గోవర్ధన్ నివాసం వద్ద జాతీయ జెండాను బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ సోమవారం చేశారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం జిల్లా ప్రభుత్వ అస్పత్రిలో పెంషెట్లకు, ఉగ్రవాయి బ్రిడ్జి వద్ద గల వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు పండ్లు, మిఠాయి పంపిణి చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్, మాజీ శాసన సభ్యులు గంప గోవర్ధన్, జుక్కల్ మాజీ శాసనసభ్యులు హన్మంతు షిండే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ధఫేదర్ రాజు, జిల్లా బీఆర్ఎస్‌పార్టీ ప్రజా ప్రతినిదులు, నాయకులు, కార్యకార్తలు, తదితరులు పాల్గొన్నారు.

- ఆస్పత్రిలో, వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

ఉత్సవాలలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

రామారెడ్డి : జిల్లా కేంద్రంలో మాజీ ప్రభుత్వం ఇప్పుడు గంప గోవర్ధన్ నీ వాసం వద్ద దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎంపీపీ దశరథ్ రెడ్డి తో పాటు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, పడిగల శ్రీనివాస్, లింబాద్రి నాయక్, జంగం లింగం, వంగ సంతోష్ రెడ్డి, టంకరి రవి, సుద్దాల లింగం, మహిపాల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్ఓసి చెక్కు అందజేత

నవతెలంగాణ-దోమకొండ

బీబీపేట మండల కేంద్రనికి చెందిన గాడి లలిత అనారోగ్యంతో బాధపడుతు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ దృష్టికి కాంగ్రెస్ పార్టీ నాయకులు తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ పండ్ నిధుల నుంచి రూ.3లక్షల ఎల్ఓసి చెక్కును మంజూరు చేయించి బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు భూమాగౌడ్, సూతారీ రమేష్, గాడి లింగం, తదితరులు ఉన్నారు.


ఎల్‌వోసీ అందజేస్తున్న షబ్బీర్‌అలీ

జహీరాబాద్ ఫలితంపై ఉత్కంఠ

- మేమంటే మేమే గెలుస్తామంటూ ఉత్సాహంగా తరలిన బిజెపి, కాంగ్రెస్ పార్టీ కౌంటింగ్ ఏజెంట్లు
- ఫలితాలు చూసేందుకు రైతువేదికలో బిగ్ స్క్రిన్
- కౌంటింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్

నవతెలంగాణ-మద్నూర్/కామారెడ్డి/సదాశివనగర్

లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు కౌంట్‌డౌన్ షురూ అయింది. మరి కొన్ని గంటల్లో ఫలితాలు తేలనున్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నిక పట్ల ఉత్కంఠ నెలకొంది. ఈ ఎన్నికపై ఇటు కాంగ్రెస్ అటు బిజెపి పార్టీల నాయకులు మేమంటే మేమే గెలుస్తామంటూ ఈ నెల 4న మంగళవారం సంగారెడ్డి జిల్లాలో జరిగే కౌంటింగ్ కోసం ఇరుపార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లు సోమవారం బయలుదేరి వెళ్లారు. లోక్‌సభకు జరిగిన ఎన్నికలకు సంబంధించి వివిధ సంస్థలు ఎగ్జిట్ పోల్ విడుదల చేయగా ఇరుపార్టీల మధ్య స్వల్ప ఓట్ల శాతం ఇవ్వడంతో ఉత్కంఠ నెలకొంది. జుక్కల్ సెగ్మెంట్ బిజెపి అభ్యర్థి బీబీ పాటిల్‌కు, సొంత నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ సెట్కారుకు నారాయణఖేడ్ సెగ్మెంట్ సొంత నియోజకవర్గం కావటం విశేషం. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా కామారెడ్డి జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి మిగతా మూడు నియోజకవర్గాలు సంగారెడ్డి జిల్లా ప్రాంతానికి చెందిన జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ ఈ ఏడు నియోజకవర్గాలలో పోలైన ఓట్ల లెక్కింపు ఈ నెల 4న మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. లోక్‌సభ ఫలితం కోసం కొన్ని రోజులుగా ప్రజలు, పార్టీల నాయకులు ఎదురుచూస్తున్నారు. గంటల వ్యవధిలోనే రాబోయే ఫలితం ఏ పార్టీకి అనుకూలమో మంగళవారం తేలనుంది. ఏది ఏమైనా జహీరాబాద్ పార్లమెంట్ గెలుపు పట్ల బిజెపి, కాంగ్రెస్ పార్టీలు పట్టు బిగించాయి. ఫలితం ఎవరికి వరిస్తుందో వేచి చూడాలి.



ఏర్పాట్లు పూర్తి

పార్లమెంట్ ఫలితాలు వీక్షించటానికి టీవి ఏర్పాటు

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను వీక్షించడానికి మద్నూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం పక్కన గల రైతు వేదిక నందు బిగ్ టీవీ (బిగ్ స్క్రీన్)ని ఏర్పాటు చేసినట్టు జుక్కల్ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించు కోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, మండల తహసీల్దార్ ముజీబ్ కోరారు.

ఫలితాల టెన్షన్.. జోరుగా బెట్టింగ్

నవతెలంగాణ-సదాశివనగర్

లోక్‌సభ ఎన్నికల ఫలితాల వేళ ఒక వైపు ఉత్కంఠ నెలకొనగా.. మరోవైపు జోరుగా బెట్టింగ్ సాగుతున్నట్టు సమాచారం. మండలంలో ఎక్కడ చూసిన ఎన్నికల ఫలితాల కోసం ప్రజలల్లో టెన్షన్ నెలకొంది. ఈ క్రమంలో ఎక్కడ చూసినా ఎవరి నోట విన్నా ఎన్నికల చర్చనే వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్ సైతం జోరందుకుంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గెలుస్తారంటూ బెట్టింగ్ కాస్తున్నట్టు సమాచారం.



ఏర్పాట్ల పరిశీలించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్



కామారెడ్డి : సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్నందున లెక్కింపు ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు గోపాల్ జి.తివారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ దగ్గరుండి పర్యవేక్షించనున్నారు. అనంతరం ఏఆర్ఓలకు, కౌంటింగ్ సిబ్బందికి తగు సూచనలను, సలహాలను కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు గోపాల్ జి.తివారి, ప్రదీప్ సింగ్ సంగ్వాత్ అందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
మంగళవారం | జూన్ 04, 2024 | www.navatelangana.com

లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా చెరుకు పృథ్వీరాజ్



నవతెలంగాణ-ఆర్మూర్

2024-2025 సంవత్సరానికి గానూ లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకు పృథ్వీరాజ్, కార్యదర్శిగా మ్యాక శ్రీకాంత్, కోశాధికారిగా చెట్లపల్లి నారాయణగౌడ్‌ను ఎన్నుకున్నారు. సంవత్సర కాలానికి గానూ మంచి కార్యక్రమాలు చేసి మన్ననలు పొందేలా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ రాజన్న, లయన్ రఫీ, గోహార్, లయన్ అంబల్ల తిరుపతి, లయన్ నరసింహ రెడ్డి, లయన్ జ్ఞాని చావ్లా, లయన్ బిజ్జు సంతోష్, లయన్ చెన్న రవికుమార్, లయన్ ఉదయ్ కుమార్, లయన్ అశ్విన్‌రెడ్డి తదితరులు పాల్గొని కొత్త కార్యవర్గాన్ని సన్మానించారు.

అక్రమ కేసులతో కక్ష సాధింపు

- మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లిలో తనకు చెందిన 76 ఎకరాల భూమిపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలు చేపట్టాలని చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన కుటుంబ సభ్యులైన నా భార్య రజితారెడ్డి, అమ్మ రాజు భాయితో పాటు ఇతర కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలు చేపట్టాలని చూస్తున్నారని జీవన్‌రెడ్డి వాపోయారు. ఈ అక్రమ కేసుల విషయంలో రాష్ట్ర హైకోర్టు తనను, తన కుటుంబ సభ్యులను అరెస్టు చేయవద్దని ఆదేశాలు ఇచ్చినట్లు జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. తనపై అక్రమ కేసులుపెట్టి అరెస్టు చేయాలనుకున్న కాంగ్రెస్ పార్టీ ఆశలు నెరవేరలేదని, హైకోర్టు తమను ఏమీ చేయవద్దని ఆదేశాలు ఇచ్చినట్లు జీవన్‌రెడ్డి వివరించారు.

విద్యుత్ పనులను ఆపడం పట్ల చౌట్‌పల్లి గ్రామ రైతుల ఆవేదన

- ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలంటున్న బాధితులు



వివాదస్పద భూమి వద్ద పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ భూముల్లో విద్యుత్ లైన్ పనులను అడ్డుకుంటున్నారని రెండు రోజుల కిందట తహసిల్దార్ కార్యాలయం ఎదుట పురుగు మందు డబ్బాలతో ధర్నా చేసిన విషయం తెలిసిందే. సోమవారం బాధిత రైతులు, మాజీ సర్పంచ్ మారు శంకర్ వివాదాస్పద భూమి వద్ద మీడియా సమావేశంలో మాట్లాడారు. 30 ఎకరాల 26 గుంటలు పట్టా భూమిని పొద్దుటూరి రాజగోపాల్‌రెడ్డి నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. తాము గత మూడు సంవత్సరాల నుంచి పంట వేసుకొని కబ్జాలో ఉన్నట్లు తెలిపారు. రెండు దఫాలుగా వరి పంట సాగుచేసామన్నారు. భూమి కూడా తమ పేర్లపైనే పట్టా ఉన్నదన్నారు. అమీర్‌నగర్ గ్రామ అభివృద్ధి కమిటీ సంఘ సభ్యులు ఆధ్వర్యంలో రెవెన్యూ, అటవీ అధికారులు సంయుక్త పంచనామ నిర్వహించారన్నారు. గత ఎనిమిది నెలల క్రితం విద్యుత్ సరఫరా కోసం తాము బషీరాబాద్ ఏఈ కృష్ణకు దరఖాస్తు, డిడి రూపంలో అందించినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాలు వేసిన తర్వాత విద్యుత్ తీగలు లాగే సమయంలో కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో ఏఈ కృష్ణకు కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఫోన్‌చేసి విద్యుత్ పనులను ఆపించినట్లు వాపోయారు. ఈ భూమి ఎలాంటి పరంపోగు భూమి, అసైన్మెంట్, ఫారెస్ట్ భూమి కూడా కాదన్నారు. తాము రాజగోపాల్‌రెడ్డి దగ్గర పట్టా భూమిని కొనుగోలు చేశామని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

కౌంటింగ్ ఏజెంట్లు జాగ్రత్తగా ఉండాలి

- బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు



రాష్ట్ర గీతం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కౌంటింగ్ ఏజెంట్లు జాగ్రత్తగా ఉండాలని కాంగ్రెస్ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కేఎన్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం కౌంటింగ్‌కు వెళ్లే కౌంటింగ్ ఏజెంట్లకు అక్కడ నిర్వహించాల్సిన విధివిధానాలపై జాగ్రత్తగా వ్యవహరించేందుకు క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి, నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంగళవారం జరిగే కౌంటింగ్ ఏజెంట్లు నిర్వహించాల్సిన విధి విధానాలు, జాగ్రత్తలపై ఏజెంట్లకు వివరించారు. మానాల మోహన్‌రెడ్డి పుస్తక రూపంలో ముద్రించిన తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ గేయ పుస్తకాలను గ్రామగ్రామాన పంపిణీ చేసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, కాంగ్రెస్ నగర అధ్యక్షులు కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, ఆర్మూర్ ఇన్చార్జి వినయ్‌రెడ్డి, ముప్ప గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షులు



బాధితుడిని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 4వ వార్డ్ దేవునిపల్లికి చెందిన రైతు సోమవారం తన పంట పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అతన్ని వెంటనే ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామస్తుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కురుమ సాయిబాబా హుటాహుటినా అతను చికిత్స పొందుతున్న ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని పరామర్శించి, మెరుగైన వైద్యం చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ ట్రస్ట్ అంబులెన్స్‌లో సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ఆసుపత్రికి తరలించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సంతోష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు సాయిబాబా గౌడ్, మహిపాల్ తదితరులు ఉన్నారు.

ఎండుతున్న మొక్కలు..
కాగితాల్లో లెక్కలు



ఎండిపోతున్న హరితహారం మొక్కలు

- హరితహారం పోషణ భారం
- లక్షల రూపాయలు వృథా
- నెరవేరని లక్ష్యం

నవతెలంగాణ-లింగంపేట్

పర్యావరణంలో రక్షించడానికి ప్రతి సంవత్సరం హరితహారం పథకం కింద మొక్కలు నాటి మొక్కలు ప్రస్తుతం ఎండకి ఎండిపోతున్నాయి. వాటిని నీళ్ల పోసే రక్షించే నాథులు కరువయ్యారు. కాగితాల్లో మాత్రం మొక్కలు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. హరితహారంలో నాటిన మొక్కలకు పెంపకం పోషణ అధికారులకు భారంగా మారింది. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి మొక్కలు నాటితే అడుగడుగునా వాడిపోతున్నాయి. ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు.

జూన్ జూలై మాసంలో ప్రభుత్వం ఆయా శాఖలను యువజన సంఘాలను భాగస్వామ్యం చేసి హరితహారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభిస్తుంది. మొక్కలు నాటే బాధ్యత ప్రతి ఒక్కరిన గ్రామాలలో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటాలని నినాదాలు చేశారు. మొక్కలు కాపాడుతామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అయితే గతంలో నాటిన మొక్కలు ఎండకు పూర్తిగా ఎండిపోయాయి.

ప్రభుత్వం ప్రతి ఏటా హరితహారం పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది. ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా సగటున 30 లక్షల మొక్కలు నాటింది. అందుకుగాను బడ్జెట్లో భారీగా కేటాయింపులు చేపడుతుంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఆశించిన స్థాయిలో హరితహారం మొక్కల పెంపక లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. ఎనిమిదేండ్లు నాటిన మొక్కను క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. మొక్కలకు లెక్కలకు పొంతన లేకుండా పోతుంది. హరితహారంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, యువజన సంఘాల సభ్యులు, విద్యార్థులు అన్ని శాఖలను భాగస్వామ్యం చేసి మొక్కలు నాటితే ప్రస్తుతం పోషణ భారంగా మారింది. హరిత పథకం జిల్లాలో అభాసుపాలవుతోంది. లక్షల రూపాయలు వెచ్చించి నాటిన మొక్కలు పట్టించుకునే వారు లేక ఎండిపోవడంతో ఖర్చు చేసిన నిధులు వృథా కావడంతో ప్రభుత్వ లక్ష్యం పూర్తిగా నీరుగారి పోతుంది.

ఎండుతున్న మొక్కలు కాగితాల్లో లెక్కలు..

జిల్లావ్యాప్తంగా గత సంవత్సరం హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పూర్తిగా ఎండిపోతున్నాయి. అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించకుండానే కాగితాల్లో మొక్కలు పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రోజురోజుకు ఎండలు తీవ్రం కావడంతో నాటిన మొక్కలు చిగురించిన మొక్కలు మాడి మసైపోతున్నాయి.

కామారెడ్డి జిల్లాలో 526 గ్రామపంచాయతీలో పరిధిలో గత ఏడాది 23-24 సంవత్సరంలో హరితహారం పథకం కింద 26.7435 లక్షల మొక్కలు నాటినట్లు అధికారులు కాగితాల్లో లెక్కలు వేసుకున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం మొక్కలు ఎక్కడా కనిపించిన దాఖలాల్లేవు. జిల్లాలోని పల్లె ప్రకృతివనాలు పచ్చదనాన్ని ఇవ్వడానికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి పకృతి వనాలను ఏర్పాటు చేశారు. ప్రతి ప్రకృతి వనంలో ప్రతి సంవత్సరం జూన్ జూలై మాసంలో మొక్కలు నాటుతునాన్రు. ప్రస్తుతం నాటిన మొక్కల ఆనవాళ్లు కనిపించకుండా పోతున్నాయి.

లక్షల రూపాయలు వృథా..

జిల్లా వ్యాప్తంగా హరితహారంలో పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు రక్షించే నాథుడే కరువయ్యాడు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా ఒక్కొక్క మొక్క నాటడానికి కూలీలకు ఐదు రూపాయలు నుంచి 8, 10 రూపాయలు చొప్పున కూలి రూపంలో చెల్లిస్తుంది. జిల్లా వ్యాప్తంగా 2023-2024 సంవత్సరంలో 26,7435 మొక్కలు చెరువు గట్లపై, పంటపొలాల గట్లపై, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, రోడ్లకు ఇరువైపులా పల్లె ప్రకృతి వనాల్లో, వైకుంఠధామాల వద్ద, శిఖం భూముల్లో మొక్కలు నాటారు. జిల్లాలో 80 పల్లె ప్రకృతి వనాలలో ఐదు లక్షలకు పైగా మొక్కలు నాటారు. కనీసం రెండు లక్షల మొక్కలు బతికున్నాయా లేదా అని అధికారులు క్షేత్రస్థాయిలో చూసిన దాఖలాలు లేవు. కొన్ని ప్రాంతాల్లో గ్రామపంచాయతీలో నాటిన మొక్కలు చోటనే మొక్కలు నాటుతూ మొక్కలు నాటినట్లు కాగితాల్లో లెక్కలు చూపెడుతున్నారు. మొక్కల సంరక్షణకు రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి కాకుండా 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

త్రిముఖ పోరులో గెలుపెవరిదో..?

- నేడు ఫలితాలు.. అభ్యర్థుల్లో ఉత్కంఠ
- ఆశగా కార్యకర్తల ఎదురు చూపు
- ఎవరి ధీమా వారిదే
- గెలుపుపై ప్రభావం చూపనున్న బాన్సువాడ ఓటర్లు



నవతెలంగాణ-వర్ని

జహీరాబాద్ ఎంపీగా గెలుపు పొందాలంటే ఏ పార్టీ అభ్యర్థి అయినా.. బాన్సువాడ నియోజకవర్గ ఓట్లపై ఆధారపడి ఉంటుంది. గత పార్లమెంట్ ఎన్నికలలో అభ్యర్థులకు మెజారిటీ బాన్సువాడ నుంచే ఉండటంతో అందరిచూపు బాన్సువాడ నియోజకవర్గంపై ఉంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో మెదక్ జిల్లాతో పాటు కామారెడ్డి జిల్లాలోని నియోజకవర్గాలున్నాయి. జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వస్తారు. అయితే అభ్యర్థులు ఎల్లారెడ్డి, నారాయణఖేడ్ సంబంధిత వారు కావటంతో అక్కడ నియోజకవర్గం ఓటర్లపై పట్టు ఉన్నప్పటికీ.. బాన్సువాడ నియోజకవర్గం నుంచి మెజారిటీ రావాలని పట్టుదలతో అభ్యర్థులు చూస్తుంటారు. గత 2009 నుంచి మెజారిటీ ఇక్కడ నుంచి ఉంటుంది అనేది మంచి నమ్మకం.

2009 నుంచి పాత అభ్యర్థులే పోటీ..

మూడు పార్టీల నుంచి పాత అభ్యర్థులే పోటీలో కొనసాగుతున్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సురేష్ కుమార్ షెట్కార్ 17,407 ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థిపై గెలుపొందారు. 2014లో బీఆర్ఎస్ అభ్యర్థిగా బిబి పాటిల్ 1,17,290 ఓట్ల మెజార్టీతో సురేష్‌కుమార్ షెట్కర్, అప్పటి టిడిపి అభ్యర్థి మదన్ మోహన్ రావుపై గెలుపొందారు. అనంతరం 2019లో బీఆర్ఎస్ అభ్యర్థిగా బిబి పాటిల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన మదన్ మోహన్‌రావుపై 6,229 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మదన్ మోహన్‌రావు ఓటమికి బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీబీ పాటిల్‌కు మెజారిటీ రావటమే గెలుపు సాధ్యమైందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా.. ప్రస్తుతం నేటి ఫలితాలు ఏ నియోజకవర్గం నుంచి మెజారిటీ ఇస్తాయో చూడాల్సిన పరిస్థితి ఉంది. ఈ సారి అభ్యర్థులు ఎవరికి వారే తమదంటే తమదే గెలుపని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'లా హెల్ప్‌డెస్క్' విజయవంతం

- హెల్ప్‌డెస్క్ కరపత్రాలను ఆవిష్కరించిన లా సబ్ కమిటీ కన్వీనర్ రాచకొండ విగ్నేష్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా లా ఎంట్రెన్స్ పరీక్ష కేంద్రాల వద్ద లా సబ్ కమిటీ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ నిర్వహించారు. ఈ సందర్భంగా లా సబ్ కమిటీ కన్వీనర్ రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ఎగ్జామినేషన్ సెంటర్ల వద్ద విద్యార్థుల సమస్యలను నివృత్తి చేయడం కోసం అదేవిధంగా వారి తమ ర్యాంకుల వివరాలు తెలుసుకోవడం కోసం వారి సమస్యలను పరిష్కరించడం కోసం హెల్ప్ డెస్కల ముఖ్య ఉద్దేశమని విగ్నేష్ తెలిపారు. అదేవిధంగా లా సీటు పొందిన తర్వాత ఫీజుల గురించి, కాలేజీ వివరాలు తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. అదేవిధంగా ఈ హెల్ప్‌డెస్కులు నిజామాబాద్ జిల్లాలోని నాలెడ్జ్ పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద, క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల వద్ద, వి.ఆర్.ఈ.సిలలో విద్యార్థుల సౌకర్యార్థం కోసం హెల్ప్ డెస్కులను నిర్వహించినట్టు వివరించారు. ఈ హెల్ప్‌డెస్కులు అనేక విద్యార్థులకు ఉపయోగపడి విజయవంతం అయిందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మహేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు దీపిక, నగర అధ్యక్షులు గణేష్, ప్రసాద్, సతీష్, ప్రవీణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మురికి కాలువల్లో చెత్తచెదారం

- దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలో మురికి కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోతోంది. సక్రమంగా నీరు వెళ్లకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువలలో ఉన్న చెత్తచెదారాన్ని మురికి కాలువల పక్కనే ఉంచడం పట్ల మురికిని తొలగించడంలో గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం చేస్తున్నారు.

ఎడపల్లి పాత గ్రామంలో, అలాగే నయాబాది కాలనీలో మురికి కాలువలలో చెత్తాచెదారం పేరుకు పోయింది. ఈగలు దోమలు చెత్త చెదారంపై వాలి తమ ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి ఇలాగే ఉంటే.. కలరా, మలేరియా, డెంగ్యూ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ కాలనీలో..

ఎడపల్లి మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో మురికి కాలువల సౌకర్యం లేక కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరమ్మ కాలనీ ఏర్పాటైనప్పటి నుంచి ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీలు నిర్మించిన దాఖలు లేవని కాలనీవాసులు అంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మురికి కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



మురికి కాలువ పక్కన చెత్తచెదారం

విలేకరులను ఢీకొన్న ట్రాక్టర్

- స్వల్పగాయాలు



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

నవతెలంగాణ-బోధన్

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ట్రాక్టర్ అదుపుతప్పి అదే రోడ్డు వెంట బైక్‌పై వెళ్తున్న విలేకరులను ఢీకొట్టింది. దాంతో విలేకరు లకు స్వల్పగాయాలయ్యాయి. బోధన్ నుంచి విధి నిర్వహణ కోసం కల్దుర్కి వైపు వెళ్తున్న విలేకరులకు బండారుపల్లి గ్రామం వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. బోధన్‌లో ఇసుక ఖాళీ చేసి అతి వేగంగా ట్రాక్టర్ వెళ్తుంది. ఈ క్రమంలో విలేకరుల ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇరువురు కిందపడడంతో స్వల్ప గాయలయ్యాయి. ద్విచక్ర వాహనం పాక్షికంగా దెబ్బతింది. గాయపడిన ఇరువురు బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. మంజీర నది నుంచి ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను అతివేగంగా నడుపుతున్నారని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ట్రాక్టర్ల అతివేగాన్ని అరికట్టాలని పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. మైనర్లు సైతం ట్రాక్టర్లను అతివేగంగా డ్రైవింగ్ చేస్తున్నారని సంబంధితశాఖ అధికారులు తనిఖీలు చేసి డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిపిఐఎంఎల్ చంద్రపుల్లారెడ్డి పార్టీ ప్రజాసంఘాల నుంచి ఇద్దరు బహిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

చాట్ల గోపి, బొనుగుల లలితను సిపిఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ నుంచి బహిష్కరించినట్టు అనుబంధ ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు ఎస్.చిట్టిబాబు, పెర్క సునీత తెలిపారు. బోధన్‌కు చెందిన చాట్లగోపి (మధు), నిజామాబాద్ బొనుగుల(పద్మ) లలితను పార్టీ, ప్రజాసంఘాల నుంచి బహిష్కరించినట్టు సిపిఐ(ఎం.ఎల్) చంద్ర పుల్లారెడ్డి పార్టీ అనుబంధ భారత రైతు కూలీ సంఘం (బి.ఆర్.సి.ఎస్) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి చిట్టిబాబు, భారత ప్రగతిశీల మహిళా సంఘం (ఐపిఓడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. 'చాట్లగోపి అలియాస్ మధు, బొనుగుల లలిత అలియాస్ పద్మగా పిలువబడే వ్యక్తులు నిజామాబాద్ జిల్లా ప్రజాసంఘాల నాయకులుగా పనిచేశారు. తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకు పార్టీని, ప్రజాసంఘాలను ఉపయోగించుకున్నారు. ముఠా తత్వానికి, అనైతిక సంబంధాలకు పాల్పడ్డారు. వ్యక్తిగత గొడవలను పార్టీ, ప్రజా సంఘాల గొడవలుగా చిత్రీకరించి, పార్టీని, ప్రజాసంఘాలను దెబ్బతీశారు. ఇటీవల పై ఇద్దరినీ మందలించి, సరిచేసుకోమని చెప్పి, ఆరునెలల పాటు సస్పెండ్ చేశాం. లేనియెడల పార్టీ, ప్రజాసంఘాలు తీసుకొనే క్రమశిక్షణ చర్యలకు గురికాక తప్పదని హెచ్చరించాం. అయినప్పటికీ వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేనందున బహిష్కరించాల్సి వచ్చింది' అని తెలిపారు. తమ పార్టీకి, ప్రజాసంఘాలకు ఇకమీదట చాట్లగోపి(మధు), బొనుగుల లలిత(పద్మ)కు ఎలాంటి సంబంధాలు ఉండబోవని చిట్టిబాబు, సునీత ప్రకటించారు. వారు ఎలాంటి కార్యక్రమంలో పాల్గొన్నా.. తమకు సంబంధం లేదని గుర్తుచేశారు.

9న జిల్లా జనరల్ బాడీ సమావేశం

డిహెచ్‌పిఎస్ డివిజన్ కన్వీనర్ మాదరి నరేష్



నవతెలంగాణ-ఆర్మూర్

మే 26 తేదీన నిర్వహించాల్సిన దళిత హక్కుల పోరాట సమితి జిల్లా జనరల్ బాడీ సమావేశం అనివార్య కారణాల వలన వాయిదా వేసినట్టు డిహెచ్‌పిఎస్ డివిజన్ కన్వీనర్ మాదరి నరేష్ సోమవారం తెలిపారు. తిరిగి జూన్ 9న పట్టణంలో సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.